స్కెచ్

# నడుస్తున్న నాగరికత

యడవల్లి రాధాకృష్ణమూర్తి

"**అ**రేఁయి, వెంకట్రావుగారికి తడిపేశారుగా!" అన్న మాటలు చెవిని పడగానే తల ఎత్తారు—ఇంగ్లీషు, లెక్కలు, బోధించుటలో నేర్పరి, హైస్కూలు సర్వీసులో పాతికేళ్ళ అనుభవమూ గల వెంకట్రావుగారు. చుట్టూ ఉన్న వాతావరణం ఆయనను అపహాస్యం చేస్తున్నట్లనిపించింది. జనుల వికవికలు, పళ్ళ ఇకిలింపులూ చూచి 'వీళ్ళెంత నిర్దాక్షిణ్యులు' అనుకున్నారు పంతులుగారు. అందులో మునిసిపాలిటీవారు కొత్తగా వేయించిన గ్యాస్‌లైట్ల కాంతితో సిరాలో ముంచెత్తబడ్డ ధవళ వస్త్రధారి వెంకట్రావుగారు అందరినీ కొట్టొచ్చినట్టు ఆకర్షిస్తున్నారు. ఇంతలో ఒక పరిచితకంఠం వినపడ్డది. 'ఏమిటి మాస్టరుగారూ! ఈ సన్మానము.' 'ఆ! మరే మన భావి యువకులు, నవభారత సారధులు, ఈ వృద్ధుల అంతిమ దినాల్లో జరిపే ఘనసన్మానము' అని చమత్కరించి ముందడుగు వేశారు అప్పుడే రైలు దిగిన వెంకట్రావుగారు.

నడుస్తున్న రావుగారి మెదడులో ఎన్నో ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి. 'తనకీ సన్మానము ఎందుకు జరిగినట్టు? తనతోటి ఉపాధ్యాయులకు కూడా కొద్దో గొప్పో ఇలాంటి సత్కారమే జరిగింది. కొందరికి ఘనంగా జరుగుతుందని వినికిడి కూడా. ఇదంతా ఎందువల్ల? పరీక్షల్లో కాపీ జరగకుండా చూచినందుకు. మరీ నిజం చెప్పాలంటే కాపీని తగ్గించ ప్రయత్నించినందుకు. అసలు పిచ్చిగాకపోతే నదీ మహా ప్రవాహానికి తా నెదురీదగలడా? యువశక్తి ప్రచండ చండమారుతమువలె ఉధృతంగా ముందుకు తోసుకొస్తూంటే గడ్డిపోచలాంటి తానునిశ్చలంగానిలబడగలడా? మరీ తను ఏం చేశాడు? విద్యాశాఖవారు తనకు రోజుకి నాలుగున్నర రూపాయలిస్తున్నది దేనికి? విద్యార్థులు పుస్తకాలు, కాగితాలు బొత్తులుబొత్తులుగా తెచ్చి సమాధానపత్రాలమీదికి రవాణా చేస్తుంటే చూస్తూ ఊరుకోవటమే నా? అందుకని వారినుంచి ఆ సరంజామా వేరుచేసి 'అబ్బాయీ! నీ మేధస్సు ఉపయోగించి వ్రాయవోయ్' అన్నాడు. అది తప్పా? 'తప్పా' అంటాడు! మరి తప్పేనన్నమాట. లేకపోతే తనకీ ఘనసన్మానము జరుగుతుందా?

పరీక్షలు సక్రమంగా నడపటానికి నియోగింపబడ్డ అధికారులే చూసీచూడనట్టు నటిస్తుంటే, తానెందుకు జోక్యం కలిగించుకోవటం? కాని ఒక విషయం మాత్రము సత్యం. ఆ అధికారులు కాపీలుపట్టుకొని చర్యతీసుకొన్నా, లేకపోయినా వాచర్లమీదకు మాత్రం ఒంటికాలుమీద వస్తారు. అదే పైకి 'రిపోర్టు'గాని వెళ్తే, అసమర్థత నాపాదించి ఉత్తరోత్తరా పరీక్షలకు వాచరుగా వేయరు. నిజానికి ఈ అసమర్థత హీనతాపాదకమైనప్పటికి సర్వజన సమాదరణీయం. విద్యార్థుల కోపతాపాలకు, రూక్షవీక్షణాలకు తాను ప్రతిద్వంద్విగా నిలచి సురిగి పోవలసిన అవసరంలేదు.

సాంకేతిక కారణాలవల్లగాని మరే ఇతర కారణాలవల్లగాని ఉపాధ్యాయులు ఇతర గ్రామాలకు వాచర్లుగా వెళతారు. అందువలన వీరికి వారి వారి గ్రామాల్లో ఈ సన్మానం జరగదు. ఈ విషయంలో మాత్రం విద్యార్థులు అతిథి మర్యాదలను అతి నిశితంగా పాటిస్తారు. వీరికి వారి గ్రామంలో మర్యాద జరిగితే, వారికి వీరి గ్రామాల్లో గౌరవ సత్కారాలు. పట్టణాల్లో అయితే పెద్దలకు ఈ సత్కారాల్లో పాల్గొనే ఉత్సాహమూ, సమయమూ ఉండవు. కాని పల్లెలలో మాత్రం ఈ సత్కారాలు పెద్దల పర్యవేక్షణలో సక్రమంగా జరుగుతాయి. అక్కడి పెద్దలకు కావలసినంత తీరికా, హంగూ ఉంటాయి.

ప్రస్తుత విద్యార్థి మనస్తత్వము, అతని వింత పోకడలమీదకు మళ్ళించారు తన ఆలోచనలను రావుగారు. పూర్వపు రోజుల్లో పిల్లలకు అక్షరాభ్యాసం చేయించి గురుగృహానికి పంపిస్తే, అతడు

వివిధ విద్యల్లో నిష్ణాతుడై, గృహస్థాశ్రమ నిర్వహణకై గురువువద్ద ననుజ్ఞ వడసి జీవిత రంగంలో ప్రవేశించేవాడు. అప్పటి పరీక్షలలో కాపీలు, పెద్దల జోక్యం ఉండేవికావు. ఫలితం కడుసమర్థమైన, ఏ పరిస్థితులకైనా అనువదించుకొని అతికిపోగల యువక సమాజ నిర్మాణం. ఆ రోజుల్లో గురువు పరబ్రహ్మస్వరూపం. ఆ స్థానానికి అంతటి పూజ్యత, గౌరవము ఆపాదింప బడేవి.

ఈ నాడు గురువు ఆ స్థానమునుండి పదచ్యుతుడైనాడు. గ్రంథాలలో మాత్రం 'గురుః బ్రహ్మ, గురుః విష్ణు' అన్న వాక్యము మిగిలిపోయింది, గురుకులాన్ని వెక్కిరిస్తూ. గురువు తన సముచిత స్థానమునుండి దిగజారి పట్టి పాఠాలు చెప్పే పంతులుగా మారిపోయిన తరువాత, ఆ స్థానాన్ని సమర్థంగా నిర్వహించగల ప్రత్యామ్నాయ శక్తి లుప్తమయింది. వివిధ కార్యకలాపాల్లో మునిగియుండే తల్లిదండ్రులెట్లాగూ ఆ పనిని నిర్వహింపలేరు. ఇక ఆ శక్తి విద్యార్థులకు వివిధ రూపాల్లో సాక్షాత్కరిస్తుంది—ఎప్పుడూ టప్పాలు కొడ్తూ జులాయిగా తిరిగే సహపాఠిగానో, లేక ప్రతి చిన్నసమస్యనూ ఉద్యమంగా మార్చగల ఛోటా స్థానిక నాయకులుగానో. వాళ్ళతో జీవితం సక్రమంగా నడుస్తున్నట్లే భావిస్తాడు విద్యార్థి. క్లాసులో టీచరు నెదిరించటం, చెప్పినపని చెయ్యక పోవటం, చివరికి 'ఫలానా పుల్లయ్యచేత క్షురకర్మ చేయించాలి' అనే సమస్యమీద జరిగిన సమ్మెలో, స్కూలుకి వెళ్ళటానికి ప్రయత్నించిన పదేళ్ళ కుర్రాడిని గోడవతలకు విసిరెయ్యడం కూడా సాహసం కృత్యంగానే భావిస్తాడు. ఈ బహుళమైన కార్యక్రమంలో అతనికి చదువుకునే తీరిక ఉండదు. దానితో 'పరీక్షల్లో ఎట్లా పాసవటమా?' అన్న తహతహ, దానికి అవసరమైన తతంగమూనూ. ఇదంతా సక్రమంగా ఫలించి, విద్యాలయాన్ని వదిలిపెట్టి, విశాల ప్రపంచంలోకి అడుగిడగానే అతనికి కనిపించేది నిరాశా వాతావరణం. జీవన వ్యాపారానికి సులభమైన ఉద్యోగం, గుమాస్తా ఉద్యోగం కనిపిస్తుంది. నిత్యమూ ఆఫీసరు చేత సహస్రార్చన. మానసిక ఖేదం. అధికారిని విద్యార్థి దశలో చేసినట్లు సమ్మెచేసి బెదరించలేడు. అథవా చేశాడా మళ్ళీ ఉద్యోగాన్వేషణ. వీరు, వెనక ఇంత ఉంటేనే తప్ప, ఇంకెందుకూ పనికిరారు.

మొన్న నీ మధ్య ఒక రాజకీయ నాయకుడు ఒకానొక విద్యాలయ వార్షిక సభలో ఉపన్యసిస్తూ "అఖిలభారత సర్వీసుల్లో ఆంధ్రుడు వెనక పడుతున్నాడు. అలాంటి అవాంఛనీయ పరిస్థితి త్వరలో అంతమొందాలి" అని వ్రాక్రుచ్చారు. నిజమే. మనం తీసికెళ్ళి ముందు నిలబెడ్తే తప్ప ముందు కెట్లా వస్తారు? ప్రతి ఉద్యమానికి అత్యవసర సమిధలు విద్యార్థులు. ప్రతి రాజకీయపక్షము వారిని పూర్తిగా వాడుకుంటుంది. ఉద్యమం సమసి ప్రశాంతత వెల్లివిరిసిన తరువాత, "విద్యార్థులు రాజకీయములలో పాల్గొనరాదు. వారు రాజకీయములు తెలుసుకొనిన చాలును," అంటూ ఉపన్యాసాలు దంచుతారు. అంటే చిన్న పిల్లాడికి 'తాయిలం పెడ్తా'నని కవ్వించి, ఊరించి తొంటి చెయ్యి చూపించినట్లుంటుంది. ఇలా జీవితమంతా క్రమశిక్షణారహిత వాతావరణంతో వంకర తీగవలె పెంపొందిన విద్యార్థి రాజకీయ నాయకులను, వారి చర్యాచర్యలను విమర్శించటం మొదలుపెట్టాడు. మరి ఊరుకుంటాడా? పసివాడికి తాయిలం పెట్టకపోతే ఏడవడంలేదూ?

మన నాగరికత అసలు పురోగమిస్తున్నదా, లేక తిరోగమిస్తున్నదా? అన్న అనుమానం వేధిస్తున్నది, రావుగారి మేధస్సును. "చిన్నతనంలోనే క్రమబద్ధకంగా పెంచబడవలసిన ఈ యువకులు, ఇట్లా పెడదారిన బడ్తున్నారే! అని వాపోయారు. కాని ప్రయోజనం శూన్యం. మంచి చెప్పే పెద్దల మాటలను వీరేమాత్రం ఖాతరు చెయ్యరు. రావుగారికి ఒకవిధంగా సంతృప్తి కలిగింది. "కనీసము స్కూలు ప్రాంగణము దాటిన తరువాతనైనా, ఉపాధ్యాయులోకాన్ని విమర్శించకుండా, వీళ్ళ దృష్టి రాజకీయాలవేపు మళ్ళీ నిజమైన కుళ్ళను కడగటానికి ఉపయోగిస్తున్నారు'అని. కాని ఆ విమర్శలకును అర్భకుల ఆక్రందనల క్రింద జమకట్టి వారి వారి ప్రపంచాలతో మైమరచి పయనించే సమాజ సముద్ధరణాభిలాషులను తల్చుకొని ఒక్క నిమిషం కించపడ్డారు. కనుచూపు దూరంలో గృహము కనిపించేసరికి సంస్కరణ భావాలకు స్వస్తిచెప్పి హుటాహుటిన పయనించారు, ఉదాత్తభావోద్వేగి, అసమర్థ సంస్కరణాభిలాషి ఐన వెంకట్రావుగారు. ★